క్లుప్తంగా

రక్షించే ప్రయత్నం చేయాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

గార: రోగుల నుంచి కాల్‌వచ్చిన వెంటనే వెళ్లి రక్షించేందుకు ప్రయత్నం చేయడమే సిబ్బంది ప్రధాన విధి అని 108 డివిజనల్ అధికారి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం గారలో 108 వాహనాన్ని, రికార్డులను తనిఖీ చేశారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రికి సాధ్యమైనంత తొందరగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఎంటీ హరీష్, పైలట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాలిహుండంలో వైఎస్సార్ పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మావతి

గార: వైఎస్సార్ పొలంబడిలో తెలుసుకున్న విషయాలతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి దుంపల పద్మావతి అన్నారు. గురువారం వరి నారు పెరుగుదల, సస్యరక్షణ చర్యలు, కలుపు నివారణపై పలు సూచనలు చేశారు. నారుమడి ఆరోగ్యంగా ఉంటే పంట కూడా దిగుబడి బాగా వస్తుందన్నారు. అనంతరం గట్లపై పెంచేందుకు కంది విత్తనాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో చింతల గడ్డెయ్య, చింతల సూర్యనారాయణ, వీఏఏ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేత



పెన్షన్ అందజేస్తున్న వలంటీరు కృష్ణవేణి

లావేరు: లావేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు డి.సుబ్బలక్ష్మమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతూ శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు ఎల్.కృష్ణవేణి గురువారం రిమ్స్‌కు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ డబ్బులు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల నియంత్రణకు చర్యలు



కుక్కలను ట్రాక్టర్ ఎక్కిస్తున్న సిబ్బంది

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సింహద్వారం నుంచి ఆలయ ఇంద్రపుష్కరిణి మార్గంలో ఇటీవల వీధి కుక్కల సంచారం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది వలల సహాయంతో కుక్కలను పట్టుకున్నారు. అనంతరం ఖాజీపేట వద్ద ఉన్న కుక్కల నియంత్రణ కేంద్రానికి (ఏబీసీ సెంటర్) తరలించారు.

షిర్డీసాయికి విశేష పూజలు



పూజలందుకుంటున్న సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొంది లీపురంలోని దర్బార్ షిరిడీసాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామివారికి మూడు హారతులు, అభిషేకాలు జరిపించారు.

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై విచారణ

బూర్జ: మండలంలో గల కొల్లివలస కేజీబీవీలో బుధవారం రాత్రి ఇద్దరు ఇంటర్ విద్యార్థినుల అదృశ్యంపై సమగ్ర శిక్షా సిబ్బంది గురువారం విద్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టారు. బోధన, బోధనేతర సిబ్బంది, తోటి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే తహసీల్దార్ ఎస్.రమణారావు విద్యాలయాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదృశ్యమైన విద్యార్థినులు హైదరాబాద్ చదువు నిమిత్తం వెళ్తున్నట్లు.. విశాఖపట్టణంలో ఉన్న ఓ విద్యార్థిని తండ్రికి ఖాజీపేట రైల్వే స్టేషన్ వద్ద అపరిచిత వ్యక్తి ఫోన్ నుంచి సమాచారం ఇచ్చినట్లు స్థానిక ఎస్ఐ బి.అశోక్‌బాబు తెలిపారు. ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ పి.జనార్దన రావు, జీసీడీఓ ఎస్.నీరజ, అసిస్టెంట్ ఐఈ ఎస్.అనురాధ, విద్యాలయం ఇన్‌చార్జి శాంతికుమారి, స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పి.వసంత, సచివాలయ మహిళా పోలీసు ఎ.చరణ్య ఉన్నారు.

● తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం



జి.సిగడాం: వాండ్రంగిలో టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న నాగరాజు



జి.సిగడాం: సంతవురిటిలో పౌష్టికాహార ప్రదర్శన



ఎచ్చెర్ల క్యాంపస్: తల్లి పాల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని అంగన్‌వాడీ కార్యకర్త శారద అన్నారు. ఎచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

జి.సిగడాం: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి పాలు పడితే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. గురువారం సంతవురిటి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పలు వస్తువులతో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వాండ్రంగి అరుణకుమారి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, నాయకులు బత్తుల సన్యాసిరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు కుప్పిలి ఉమామహేశ్వరి, పూర్ణిమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

జి.సిగడాం: వాండ్రంగి గ్రామంలో సర్పంచ్ సాకేటి నాగరాజు సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, ఉప సర్పంచ్ డబ్బాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

● గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందజేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కుశాలపురంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ఒక వర్గానికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని గుర్తు చేశారు. ఇప్పుడు సచివాలయం యూనిట్‌గా ప్రతి అర్హునికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలు సైతం జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల ప్రభుత్వ కాలంలో అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యమిస్తూ ముందుకు సాగినట్లు వివరించారు. సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇళ్లకు ప్రభుత్వ పథకాలు చేర్చుతున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నా ప్రజలు మాత్రం సంక్షేమ పాలనకు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, స్థానిక నాయకులు పైడి త్రిమూర్తులు, వెంకన్నగారి శ్రీను, చిగురుపల్లి కృష్ణమూర్తి, పైడి సాంబమూర్తి, మురళీధర్, చంద్రరావు, అమ్మినాయుడు, ఆనందరావు, టౌన్ ప్లానింగ్ అధికారి సీతారాం, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, వెలుగు ఏపీఎం రామూర్తి పాల్గొన్నారు.

సంతోషంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేస్తారు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాలనపై సంతోషంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేస్తారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 98 గ్రామ సచివాలయాల పరిధిలో 83674 ఇళ్లల్లో సర్వే నిర్వహించినట్లు వివరించారు. 48951 మంది దరఖాస్తు చేసుకోగా 48268 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాలన పట్ల ప్రతిఒక్కరూ సంతోషంగా ఉన్నారని, వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తారని తెలిపారు. శతశాతం సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల మంజూరుకు ప్రభుత్వం జూలై 1 నుంచి 31 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.46 కోట్ల మందికి ప్రభుత్వ సేవలు అందాయని వివరించారు. 93.05 లక్షలు మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో 1.69 లక్షలు మంది వలంటీర్లు, 1200 మంది అధికారులు, సిబ్బంది ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బొడ్డేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

లావేరు: విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పెదలింగాలవలస వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, సచివాలయం ఏఎన్ఎం ఎ.సుజాత అన్నారు. లింగాలవలస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు తప్పని ఇక్కట్లు



బీఎల్‌వోలకు సర్వే కోసం ఇచ్చిన యాప్

లావేరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన యాప్ పని చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలు పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం చేపట్టడం కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ పోలింగ్ కేంద్రాల బూత్ లెవల్ అధికారులకు ప్రత్యేక యాప్ ఇచ్చారు. అందులోనే ఓటర్ల సర్వే వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే యాప్ సరిగ్గా పనిచేయకుండా ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్ అని రావడంతో అవస్థలు తప్పడం లేదని సిబ్బంది అంటున్నా రు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యాప్ పనిచేసేలా చర్యలు చేపట్టాలని బీఎల్‌వోలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం నేచురల్ మాస్టర్ రాజేష్ అన్నారు. గురువారం కొప్పలపేటలో అజోల్లా సేంద్రియ ఎరువును తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు సాధించగలమన్నారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మారేడు పత్రం కషాయాలను తక్కువ ఖర్చుతోనే తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో త్రినాథరావు, తవిటినాయుడు, లక్ష్మణరావు, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాలకు నాణ్యతా పరీక్షలు



బ్యాలెట్ బాక్సులను పరీక్షిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు కొత్తగా వచ్చిన వి.వి.ప్యాట్, ఓటింగ్ యంత్రాలు, యూనిట్లను గురువారం ఎన్నికల సామగ్రి గోదాములో తనిఖీ చేశారు. మొత్తం 7070 యూనిట్లను 15 రోజుల పాటు పరిశీలించనున్నారు. డీఆర్‌ఓ పి.మురళీకృష్ణ పర్యవేక్షణలో ఈ బెల్ ఇంజినీర్లు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సిబ్బంది ఆక్సుపెన్సీ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో సి-సెక్షన్ సూపరింటెండెంట్ బి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గుజరాతీపేట శివాలయం వీధిలో నివసిస్తున్న ఓ వివాహిత తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఓ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న తూటిక యుగంధర్ 2014లో ప్రవీణను ప్రేమ వివాహం చేసుకున్నాడు. తల్లిదండ్రులు లాంఛనంగా రూ.10 లక్షలు వరకు అందించారు. కొన్నాళ్ల తర్వాత యుగంధర్ తరచూ ఇంటికి మద్యం తాగి వస్తూ ప్రవీణను తిడుతూ, కొడుతుండేవాడు. ఈ క్రమంలో గత నెల 31న కంపెనీ పనిపై బయటకు వెళ్లిన యుగంధర్ ఈ నెల 2న ఇంటికి ఫుల్‌గా మద్యం వచ్చి దుర్భాషలాడుతూ భార్యపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో ప్రవీణ తల్లిదండ్రులు గురువారం ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



నిరసన తెలియజేస్తున్న స్థానికులు

రణస్థలం: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం చేపట్టవద్దని రణస్థలం-రామతీర్థాల కూడలిలో స్థానికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రామతీర్థాలు కూడలిలో హైస్కూల్ ఎదురుగా నారాయణశెట్టి శ్రీనివాసరావు ఇంటిపై సెల్ టవర్ నిర్మించేందుకు సదరు టెలికం యాజమాన్యం చర్యలు చేపడుతున్నారు. ఈ విషయమై నాలుగు నెలల క్రితం రెండుసార్లు స్థానికులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సమస్య వివరించారు. జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ గురువారం ఉదయం టెలికం ప్రతినిధులు పనులు చేపట్టడంతో స్థానికులు ఆగ్రహిస్తూ పని ప్రదేశంలో బైఠాయించారు. ఆరోగ్యాలకు శాపంగా మారుతున్న సెల్ టవర్ వద్దంటూ నినాదాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. ప్రజల నిరసనతో సెల్ టవర్ కార్మికులు పనులు నిలిపివేసి వెళ్లిపోయారు.

తిరుమలలో విష్ణు సహస్రనామ పారాయణం

నరసన్నపేట: తిరుమలలో నిర్వహించిన విష్ణు సహస్రనామ పారాయణంలో నరసన్నపేటకు చెందిన హరే శ్రీనివాస భక్త బృందం సభ్యులు 60 మంది పాల్గొన్నారు. ఆస్థాన మండపంలో ఒకటో తేదీన ఏర్పాటు చేసిన కచేరీలో పాల్గొన్నారు. కోలాటం, మాడ వీధుల్లో హనుమాన్ సాలీసా పారాయణంలోనూ పాల్గొన్నట్లు భక్త బృందం ప్రతినిధి వారణాశి సంతోషి తెలిపారు.

తెలుగు వెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు వ్యవస్థాపకులు తాల్లపాక స్వామిజీ , తెలుగు రాష్ట్రాలకు చెందిన సేవా ట్రస్టు డైరెక్టర్ సునీత ఆహ్వానం మేరకు వెళ్లామన్నారు.



హరినామ పారాయణం నిర్వహిస్తున్న హరే శ్రీనివాస భక్త బృందం

6న ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సభ ఈ నెల 6న ఉదయం 9.30 గంటలకు పలాసలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరగనుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సుమన్, కార్యదర్శి పి.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, కోటేశ్వరరావు, రాజారావు తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సభలో ప్రధానంగా పీఎఫ్ 95 పెన్షన్, యూఏఎన్ నంబరు, ఇటీవల విజయవాడలోని ఆర్టీసీ ఎండీ కార్యాలయం వద్ద జరిగిన మహా ప్రదర్శన, విశ్రాంత కార్మిక సోదరులకు రావాల్సిన బకాయిలపై చర్చించనున్నట్లు వివరించారు. అందరు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



పవన్‌కుమార్ మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వాంబేకాలనీ రాజీవ్ గృహకల్పలో తాళాబత్తుల ఢిల్లీశ్వర్రావు, జగదీశ్వరి దంపతులకు కుమారుడు పవన్‌కుమార్ (22), వివాహమైన కుమార్తె ఉన్నారు. ఢిల్లీశ్వరరావు కార్పెంటర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో పవన్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలుపాలవ్వడంతో అప్పటినుంచి బెడ్ రెస్టులోనే ఉన్నాడు. తోటి స్నేహితులు, అంతా హ్యాపీగా జీవితాన్ని గడుపుతుంటే.. తాను మాత్రం ఇంట్లోనే ఇలా అనారోగ్యంగా ఉండటంపై ఎప్పుడూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం తల్లిదండ్రులు లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘ నాయకులు

రణస్థలం: మణిపూర్‌లో గూడు చెదిరిన, గుండె పగిలిన అభాగ్యులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే న్యాయం చేయాలని రణస్థలం, లావేరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ రూబెన్ కోరారు. మణిపూర్ మారణకాండకు నిరసనగా రణస్థలంలోని డబ్ల్యూఎం చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు క్రైస్తవులు శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సత్యవతికు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలు, క్రైస్తవులు, బలహీన వర్గాలపై జరుగుతున్న దాడులు, స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగించడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ సెక్రటరీ దోమాన రత్నం, ట్రెజరర్ జెమ్స్, సభ్యులు భాస్కరరావు, సుధాకర్, ఆమోస్, సురేష్, శైలేష్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారం

అరసవల్లి: అరసవల్లి లక్ష్మీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారం విజిలెన్స్ నుంచి మళ్లీ ఆపరేషన్స్ అధికారుల వద్దకు వచ్చింది. గత నెల 3న 'ఇదేం తీరు' అన్న సాక్షి కథనంపై విద్యుత్ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు విచారణకు ఆదేశించడమే కాకుండా విచారణాధికారిగా జనరల్ మేనేజర్ చలపతిరావును నియమించిన సంగతి విదితమే. ఈయన కూడా క్షేత్రస్థాయిలో తప్పు జరిగినట్లుగానే నివేదికను చీఫ్ జనరల్ మేనేజర్‌కు అందజేశారు. చీఫ్ విజిలెన్స్ అధికారి ఎ.వి.ఎల్ ప్రసన్నకుమార్ సైతం ఈ వ్యవహారంలో డీ-1 ఏఈ కమల్‌హాసన్ వ్యవహారాన్ని ప్రాథమికంగా అక్రమంగానే గుర్తించారు. ఇదే సందర్భంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు కొన్ని విద్యుత్ స్తంభాలను కూడా అక్రమంగానే ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు ఈ వ్యవహారమంతా సక్రమంగానే ఉందంటూ టౌన్ డిప్యూటీ ఈఈ రాంబాబు విజిలెన్స్ అధికారులకు లిఖితపూర్వకంగా నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. ఈ వ్యవహారంలో మరోసారి విచారణ చేయాలని..నిజానిజాలను తేల్చాలంటూ ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడుకు విజిలెన్స్ అధికారులు ఆ ఫైలను అందజేశారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



మొక్కలు నాటుతున్న డీహెచ్‌ఓ ప్రసాద్

శ్రీకాకుళం రూరల్: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని డీహెచ్‌ఓ ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కళ్లేపల్లిలో గురువారం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ పంటలో లాభాలు ఎక్కువన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, పతాంజలి మేనేజర్ రాజమోహన్, సర్పంచ్ గంగు నరేంద్రకుమార్, ఎంపీటీసీ కిషోర్, మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి పాల్గొన్నారు.